ఆకాశవాణి విజయవాడ కేంద్రం-వనిత వాణిలో ప్రసారమైన రేడియో కథ :

రచన: శ్రీమతి వలివేటి నాగచంద్రావతి: తేది: 8-9-2018

# మరక

పచ్చగా పసుపు రాసి, తీరుగా కుంకుమ బొట్లు పెట్టి ధట్టం గా మావిడాకు తోరణాలు కట్టిన గడప పెద్ద ముత్తయిదువులా కళ కళ లాడుతోంది. ఆ గుమ్మం ఎదురుగా ఆకు పచ్చ పట్టు చీర కట్టుకుని కుడి చేతిలో దేవుళ్ళ విగ్రహాలు, కవ్వం, వగైరాలు పెట్టిన ఇత్తడి పళ్లెం, రెండో చేతితో ఆరెల్ల కొడుకు వంశీ చెయ్యి పట్టుకుని నుంచుంది వసంత. ప్రక్కనే భర్త మాధవరావు వాచి చూసుకుంటూ నిలబడ్డాడు. ఎనిమిదేళ్ల వాణి తండ్రి వేలు పట్టుకొని మొబైల్ లో వినబడుతున్న నాద స్వరం ఆసక్తిగా వింటోంది.

ఇంకా ఎంత టైముంది .. కొంచెం అసహనంగా అడిగింది వసంత.

"అయిపోయింది ఎనిమిదీ ఇరవైకి ఇంకో పది సెకన్లు" అన్నాడు మాధవరావు.

"ఇంక పదండి" మాధవరావు అనటమేమిటి వాణి తండ్రి చెయ్యి వదిలింది, ఒక్క అంగలో గుమ్మం దాటపోయింది.

"ఆగు" కరుగ్గా ఒక్క గదుమ గదిమి వాణి చేయి పుచ్చుకు విసురుగా లాగింది వసంత.

బిక్క మొహం తో మళ్ళీ వెనకొచ్చి తండ్రి చెయ్యి పట్టుకుంది వాణి. మాధవరావు కళ్ళల్లో కోపం, బాధ తాండవించాయి.

అదేమి లెక్క చేయనట్లుగా వసంత నవ్వు ముఖం పెట్టి కొడుకుతో సహా ముందుగా గృహ ప్రవేశం చేసింది. ఆవెనక నిట్టూర్పు విడుస్తూ కూతురుతో ముందుకు కదిలాడు మాధవరావు

ముందు పెద్ద హాలు, దక్షిణం వైపు రెండు పడక గదులు. పూజ గది. విశాలమైన వంటిల్లు. కొత్తగా పెయింట్ చేసిన ఆ ఇంటిని ఆనందంగా తృప్తిగా ఓసారి అంతా తిరిగి చూసుకుంది వసంత. గది, గదికి పరుగు పెట్టారు పిల్లలు.

"చక్కగా నల్గుర్ని పిలిచి గృహప్రవేశం చేసుకుంటే బాగుండే దేమో కద." వెంటతెచ్చుకొన్న సంచి లోంచి కొత్త ఇత్తడి గిన్నె, పాల పాకెట్ బయటకి తీస్తూ అన్నది వసంత కాస్త విచారం గా.

"ఇంతోటి సెకండ్ హ్యాండ్ అపార్ట్మెంట్ కి ఆ ఖర్చు గూడా ఎందుకు అని నువ్వేగా అన్నావ్" అన్నాడు మాధవరావు.

అతను మాములుగానే అన్నప్పటికి దెప్పినట్లు పెడర్థం తీసి, “వు ...ఇలాంటివి మాత్రం బాగానే గుర్తుంచుకుంటారు. "అంటూ రుసరుస లాడుతూ వెడుతున్న వసంత ని నిర్లిప్తం గా చూశాడు మాధవరావు." ఒక తల్లి బిడ్డ లే అయిన కళ్యాణికి ఈ వసంతకి ఎంత భేదం.

వంట ఇంట్లో పాలు పొంగించే కార్యక్రమం లో పడిపోయింది వసంత. హాల్లో కిటికీ కి దగ్గరగా కూర్చీ లాక్కొని కూర్చున్నాడు మాధవరావు. లోపలనుంచి వసంత వాణిని కసరటం,

"ఒక్క పని చేత కాదు. తిండి కి మాత్రం ముందు తయరవుతావ్" అని విసుకోవటం," ఆ మొహం చూడు - నోట్లో వేలు పెడితే కొరక లేని దాన్లా ఎలా పెడుతుందో - ఎక్కడికి పోతావ్ అన్నీ అమ్మ వేషాలే." అని విసుర్లు విసరటం వినిపిస్తు మనసు కలత పరుస్తున్నాయ్. "ఎప్పటికీ ఈ వసంత మారదా?" వేదనగా అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు మాధవరావు.

* * *

వాణి అంటే వసంత కెందుకంత అయిష్టం? - అంటే పిల్లి ఎలుక శతృత్వం లాంటి శాస్త్రీయ కారణమే వుంది. వసంత కి సవతి కూతురు వాణి. కానీ ఆ సవతి ఎవరో కాదు - వసంత కి స్వయం గా చెల్లెలు కళ్యాణి. వసంత కి మహామత్సరం ఆ చెల్లెలు అంటే. అదీ ఎందుకంటే--

వసంత ని చూట్టానికి పెళ్ళి చూపులకని వెళ్లి వసంత చెల్లెలు కళ్యాణి మీద మనసును పారేసుకున్నాడు మాధవరావు. ఆ అమ్మాయి వేడల్పాటి కళ్లలో నిర్మలత్వం, నుదుటి మీద అపురూపంగా నాట్యమాడే ముంగురుల సోయగం, ఒత్తైన తలకట్టు అతన కళ్ళని కట్టి పడేశాయి. ఆ అమ్మాయి అయితే తనకే అభ్యంతరం లేదని అప్పటికప్పుడే మొహమాట పడకుండా చెప్పేసాడతను.

అదిగో అక్కడే వసంత అభిమానమనండి లేదా అహంకారం మనండి దెబ్బ తిన్నది. చెల్లెలి కంటె తను చాల అందగత్తెనని వసంత గట్టి నమ్మకం. కళ్యాణి కంటె తను చాలా తెలుపు. చెల్లెలులా మన్ను తిన్న పాములా కాక, తను చాల చలాకీగా వుంటుంది కూడాను. ఎదో ఆ కళ్ళు జుట్టు తప్పా ఏమంత ఆకర్షణ లేని చెల్లెలు తనకు పోటీ దారు అవుతుందని కలలో కూడా అనుకోలేదు వసంత.

పైగా మాధవరావు వడ్డూ , పొడుగు రాజకుమారుడి లా వున్నాడు. సరిగ్గా తనకి సరిజోడనీ, తనక్కాబోయే మొగుడతగాడేనని ఫిక్సయిపోయింది కూడా. అలాంటిది - ఏమి తెలియని దాన్లా అందరికీ కాఫీ అందిస్తానని వచ్చి నట్టు వచ్చి ఆ అందగాడి మనుసునే వశం చేసుకున్న చెల్లెలి మీద ఆ క్షణంలో పుట్టుకొచ్చింది జెలసి. కాకపోతే ఎవరికీ కనిపించకుండా గుండె లోతుల్లో అంకురించిన విషపు మొలక అది.

అదలా వుంచితే - పెద్ద కూతురికి చేయకుండా చిన్నమ్మాయికి పెళ్లి చేయటంమా? అని కాస్త వెనకా ముందు ఆడినా, ఇద్దరు ఎదిగిన ఆడపిల్లలున్న మధ్యతరగతి గృహస్తు - కోరి వచ్చిన వరుణ్ని ఎలా కాలదన్నుకోగలరు? కళ్యాణి ని మాధవరావు కు నిశ్చయం చేసారు. ఆరు నెలల తర్వాత వివాహం ముహూర్తం పెట్టి ఆ లోపల వసంత కి ముందు వివాహం చేయాలని గట్టి ప్రయత్నమే చేసారు. కానీ వసంత తనని చూడ వచ్చిన ఏ వరుడు మాధవరావుతో సరిగుతాడనిపించక తల అడ్డంగా ఊపేసేది. ఇంకా ఆగమనటం సబబనిపించక కళ్యాణి మాధవరావు వివాహం జరిపించేసారు.

ఒక్క ఏడాది అతి సౌమ్యరాలు అయిన కళ్యాణి సాంగత్యంలో ఎంతో ఆనందాన్ని ప్రశాంతతని చవి చూశాడు మాధవరావు . మరుసటి సంవత్సరం నెల తప్పిన దగ్గరనించి నలత గానే వుంది కళ్యాణి . ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాణికి జన్మ నిచ్చి తానీ లోకం నుండి సెలవు తీసుకుంది.

పిచ్చి వాడై పోయాడు మాధవరావు . సహచారి వియోగ విషాదం తో పాటు కక్కటిల్లు తున్న పసికూన కలచి వేస్తోంది అతని మనసు. ఆ సమయం లో పాపని నేచూసుకుంటానని ముందుకు వచ్చింది వసంత. కాకపోతే బిఢ్ఢ తో పాటూ బిఢ్ఢ తండ్రిని కూడా తన చేతి కప్పగించాలనే షరతు అని చెప్పకుండా పెట్టిన షరతు. ఆశించినది కాదు గాని వుహించని విధముగా వచ్చిన అవకాశం రెండవ పెళ్లి అని వదులుకోదలచలేదు వసంత.

చెయ్యొచ్చా? కూడదా? అన్న ప్రశ్న పెఢ్ఢల ముందు కొచ్చి కూర్చుంది మళ్ళీ. ముందు వసంత కి అని అనుకున్న సంబధమే ఇది. - మధ్య లో రెండేళ్ళు భగవంతుడు ఇంకో నాటకమాడించెడు . మరి ఇప్పుడు ఇలా చేయటం సబబా? కాదా? అన్న కొంచెం గుంజాటన! ఆ తర్వాత పరిస్తితులని బట్టి సరేనటమే మంచిదనుకున్నారు ఇరువైపుల పెఢ్ఢలు. ముంచెసే విషాదంలో వున్నాడు మాధవరావు. ఏడ్చే పసిగుఢ్ఢుని చూపిస్తూ చుట్టూ వున్నవాళ్ళు గుర్తు చేసే భాద్యత. తల్లి తండ్రులు, అత్త మామల ముసలి తనపు నిస్సహాయత. ఎటూ నిర్ణయించుకోలేని అయోమయంలో మాధవరావు వసంత మెడలో తాళి కట్టాడు.

ఆ మూడు ముళ్ళు పఢ్డాయి - వసంత అసలు రూపం బయటకు వచ్చింది. తనకు కావాలి మాధవరావే కానీ వాణి కాదు. దేవుడు మేలు చేసి చేజారిన అదృష్టం మళ్లీ తనకే దక్కిందనీ సంతోషించడానికీ లేకుండా , 'ఈ ఏడుపు గొట్టు పిల్ల ఒక్కతి - నీ కంటే ముందు మా అమ్మ కాకెంగిలి చేసిందోచ్ అని వెక్కిరిస్తునట్లు' అనిపించి లో లోపల కొర కొర లాడేది.

రాను రాను వసంత మరీ ఎలా తయారైందంటే చెల్లెలి పాపని కన్న బిఢ్ఢలా చూసుకుంటానని అందరి ముందూ అన్న మాట గాలికి విసిరేసి వాణి ఏడుస్తే చిరాకు. పాలు పట్టాల్సి వస్తే విసుగు. "కొత్త కాపరమని ఓసిని లేదు. షికారు లేదు. వెధవ ఏడుపులు, పొత్తి గుఢ్ఢలు మార్చటాలు తప్ప - " అని తల కొట్టుకోవటం, "తల్లి లేని పిల్ల అని ఎవరైన సానుభూతి చూపిస్తే" చాలు సహించలేక ధూమధుమ లాడడం మొదలు పెట్టింది.

మాధవరావు ది సరళ స్వభావం. అసలే భార్యని కోల్పోయి మానసికంగా దెబ్బ తిని వున్నాడు. ఆ బలహీనత మూలం గానే వసంత ప్రవర్తన ఎంత బాధ పెడుతోన్నా ఎదురు తిరిగి పరుషం గా ఒక్క మాట అనలేకపోయెవాడు. వసంత ని నొప్పించటం అతనికి ఇష్ట మయ్యేది కాదు

ఆ మెతకతనమే వసంతకు అలుసైపోయింది. దేనికీ అతన్ని నోరెత్త నీయదు. అంతా తనదే రాజ్యం. ఎప్పుడైనా వ్యతిరేకంగా నోరు మెదిపాడో - తనకేదో అన్యాయం జరిగినట్లు అల్లరల్లరి చేస్తుంది.సంవత్సరాలు తిరిగి పోతున్నా తను ఒక బిఢ్ఢ తల్లయి అమ్మతనం తెలిసి వచ్చినా వాణి అంటే అదే అయిష్టం. అదే విరోధ భావం. తల్లికి తానంటే ఎందుకు

ఇష్టం లేదో తెలీదు వాణికి. కొట్టినా, తిట్టినా బేలగా జాలిగా లేడి కళ్ళు తో అలా చూస్తు వుండి పోతుందంతే.

పాపం మాధవరావు వసంత కాఠిన్యం నుండి కూతుర్ని కాపాడుకోటానికి తాపత్రయ పడి పోతుంటాడు. ఎప్పటికైనా వసంత మారక పోతుందా? అన్న ఆశ అతనిది.

* * * * *

అయ్యో, అయ్యో నీచేతులు పడిపోను గోడ అంతా ఖరాబు చేసావు కదె పాపిష్టిదానా --"ఉచ్చైయ్ స్వరం తో దూషణ శతనామావళి వల్లిస్తోంది వసంత.

'ఏం కొంప మునిగిందో-' ఆలోచనలన్నీ అటకెక్కించి హడలి పోతూ అటు పరిగెట్టాడు మాధవరావు. దూకటానికి సిద్ధం గా వున్న పులిలా వుంది వసంత. ఎదురుగా మేక పిల్లలా బెదురుతూ వాణి. ఆ ప్రక్కనే వులుకు పలుకు లేకుండా చూస్తూ వంశీ.

విసురుగా వాణి పట్ల వూరుకుతూ పైకి లేపిన వసంత చేతిని అర్జెంటుగా పట్టుకుని ఆపాడు మాధవరావు. "ఏమైంది?"

"ఏమైందా?" చూడండి మీ కూతురి నిర్వాకం. దూకుడుగా వాణి ని ప్రక్కకి లాగింది వసంత.

లేత నీలం రంగు వేసిన ఆ గది తూర్పు వైపు గోడ మీద అడుగు అడుగున్నర మేర పసుపు రంగు పెయింట్ చిక్కగా కారే టట్టుగా కొంత, పల్చ పల్చగా కొంత - దాని మీద ఎరుపు రంగుతో ఒంకరటింకర గా రాసిన 'ఓం' అన్న అక్షరాలు. దానికి నాలుగు వైపులా చేతొచ్చినట్టు రాసిన స్వస్తిక్ గుర్తులు, చుట్టూరా అడ్డదిడ్డం గా ఏవో డిజైన్లు.

అదంతా పిల్లలు చేసిన ఘనకార్యమే అనడానికి గుర్తుగా ఇద్దరి చేతుల్లో బ్రష్ ల నుండి ఇంకా ఎర్ర రంగు చుక్కలు కారిపోతున్నాయి. ఇంట్లో పెయింట్లు వేసాక ఇంకా మిగిలి పోయిన రంగులు ఆ రూమ్ లో పెట్టారు పనివాళ్ళు.

పూజ గదిలో దేవుడి మందిరం ప్రక్కన ఈ మాదిరి గానే గోడకు పసుపు రాసి కుంకుంతో స్వస్తిక్లు అలంకారం చేసింది వసంత. అది చూసి ఈ ప్రయోగం ఇక్కడ చేసినట్లున్నారు పిల్లలు. నవ్వాలో, ఏడవలో తెలియలేదు మాధవరావుకి. "పోన్లే వసూ.... చిన్న సన్నాసులు, ఎదో తెలీక అల్లరి పని." సముదాయించబోయాడు మాధవరావు.

"వాళ్లే కలపకండి" ఖయ్యి మన్నది వసంత. "పసి వెధవ వాడికేం తెలుసు? ఈ దెయ్యమే నేర్పుతుంది. నాలుగు రోజులవల పెయింట్లు వేయించి. ఏదీ చక్కగా ఉంటే ఓర్వలేదు కదా ! "ఇంట్లో అడుగు పెట్టిందంతే, తగల పెట్టేసింది చుప్పనాతి.

"అబ్బా వూరుకో వసంతా.... అదీ చిన్న పిల్లే కదా." సమర్థించబోయాడు.

"ఇదిగో ఇలా వెనకేసుకు రాబట్టే ఇంకా రెచ్చిపోతోంది . మీరు వూరుకోండి. ఒక్కసారి అట్ల కాడ కాల్చి వాత పెడితే మళ్ళీ చెయ్యదు ఇల్లాంటి పనులు - కోపంలో ఏమి మాట్లాడుతోందో తెలియట్లేదు వసంతకి.

"ఇంక చాలు నోరు ముయ్యి వసంతా" వాణిని అక్కడ నుండి లాక్కుపోతూ గట్టిగానే కసురుకున్నాడు మాధవరావు.

అక్కడే వుండి ఆ గోడ కేసి చూస్తున్న కొద్ది కక్ష తాటి ప్రమాణం పెరిగి పోతుంది వసంత కి . "నరికేయాలి దీన్ని" కసిగా పళ్ళు పట పట లాడించింది వసంత.

పావు గంట దాక ఉప్పు కూడా లేని ఖారం తిన్న దాన్లా అందరిమీదా ఖస్సు బుస్సు లాడుతూనే వుంది. పొంగలి నైవేద్యం అందరికి ప్రసాదం గా పెడుతున్నప్పుడు మాత్రం తూఫాన్ కాస్త శాంతపడి సద్దు మణిగిందనిపించి, ఇంకా ఫర్వాలేదు అనుకోని, అల్లరి చేయకుండ ఆడుకోమని పిల్ల లకు చెప్పి కారియార్ తీసుకొని హొటల్ నుండి భోజనం తెస్తానని బయలు దేరాడు మాధవరావు.

కామ్ గా సామాన్లు సద్దుకుంటున్న దల్లా భర్త బయటకి వెళ్లగానే ఆగ్రహానికి కట్లు తెగాయి. తమ్ముడికి కాగితం పడవ చేస్తున్న వాణి ని, "ఇలా రావే" అన్నది కామ్ గా.

బెరుకు బెరుగ్గా దగ్గర కొచ్చిన వాణి చెవి పట్టుకుంది అమాంతంగా "మర్చిపోయాననుకున్నావా?... లేదే. ఆ గోడ చూస్తుంటే కడుపు రగలి పోతోంది. చెప్పవే చెప్పు. అలాంటి వెధవ పనులు చేయకుండ వుంటావా లేదా?" అన్నది కళ్ళెఱ్ఱ చేసి. కొయ్యబారి పోయింది వాణి. చెవి నెప్పి పెడుతున్నా ఆ భయానికి ఏడుపు కూడా బయటకి రావట్లేదు. వాణి నించి ఏ స్పందన రాకపోయేసరికి మరీ మండిపడి పోయింది వసంత. "ఏమే నోరు పడిపోయిందా? మీ అమ్మ ఎత్తుకొని పోయిందా? చెప్తా. నిన్నిట్లా ఒదిలేస్తాననుకున్నావా? లేదే. అట్ల కాడ కాలేసి ఎప్పుడు జ్ఞాపకముండేలా వాత పెడతా. మళ్లీ ఇట్లాంటివి చేయకుండా."

మహోగ్రంగా వంటింటి లోకి వెళ్లి నిజం గానే చేత్తో అట్ల కాడ పట్టుకు వచ్చింది వసంత. "చెప్పు, బుద్ధి గా వుంటావా? చెప్పినట్టల్లా వింటావా?" చేయి ఊపుతూ బెదిరిస్తోంది వాణిని.

సరిగ్గా అప్పుడే వీధి తలుపు తోసుకుని లోపల కొచ్చింది పక్క అపార్ట్ మెంట్ ఆమె. కొత్తగా దిగిన నైబర్స్ ని పలకరించి పోదామని. పులొచ్చి మీద పడుతున్నట్లు బెదిరి పోతున్న పిల్లలు, అట్లకాడ వూపుతూ కాళిక ల వసంత . తెల్లబోయిందావిడ. బిత్తర పోయిన వసంత వెంటనే తేరుకొంది. "రండి రండి. పిల్లలు ఒకటే అల్లరి. బెదిరిస్తున్నానంతె, లేకపోతె మాటవినరు." బొడ్లో దోపిన కుచ్చిళ్ళు కిందకి జార్చి చిరునవ్వు మోహాన అతికించుకుని ఆహ్వానించి దావిణ్ణి.

వాళ్ళు మాటల్లో పడ్డారు. వంశీ, వాణి గది లోకి వచ్చారు. "అక్కా నాన్న రాకుండానే ఆంటీ వెళ్లిపోతే అమ్మ నీకు వాతలు పెట్టేస్తుందేమో" వంశీ అన్నాడు జాలిగా.

"అవునురా" దిగాలుగా అంది వాణి.

పది నిమిషాల తర్వాత ఏదో ఆలోచించినట్లు, "అక్కా నువ్వు పారిపో." అన్నాడు వంశీ.

"అమ్మో" వాణి కళ్ళు పెద్ద వయ్యాయ్.

"ఆహా, నాన్న మనకి లంచ్ తెచ్చే దాకానే...... ఏం..... బయటికి వెళ్లి దాక్కుంటావా?" ..... సాహసం చేయబోతున్నట్టు వుత్సాహ పడ్డాడు వంశీ. మెల్లగా ఇద్దరు చప్పుడు చేయకుండ బయటకు వచ్చారు. వంశీ అక్కకు 'బై' చెప్పాడు. వాణి ఆ సందు చివరి బడ్డీ కొట్టుముందర

బల్లలుంటే అక్కడ కూర్చుని ఓ పావుగంట తండ్రి వస్తాడని ఎదురు చూసింది. ఆసందు మేయిన్ రోడ్డులో కలుస్తుంది. ఆ రోడ్డు మీద ఎదో వూరేగింపు వెడుతోంది. రంగు రంగుల బట్టలూ, వాయిద్యాలు అట్టహాసం గా అలంకరించిన కారు ముందర, నాట్యాలు, మంత్రముగ్ధురాలయినట్టు ఆ వూరేగింపు తో పాటు నడిచింది వాణి. ఆ వూరేగింపు ఒక భవనం ముందు ఆగి పోయింది. వెనక్కి తిరిగి వస్తుంటే ఓ ఇంటి ముందు కోతులాడించేవాడు ఆకర్షించాడు. వాడితో పాటు సందు గొందూ లన్నీ తిరుగుతూ వూరి బయటదాకా వెళ్ళిపోయింది వాణి.

* * * * *

"ఏమయింది నా బిడ్డ" "ఏం చేసావ్ నా తల్లిని "ఆక్రోశం, ఆగ్రహం మాధవరావు గొంతులో పోటీ పడుతున్నాయి. బద్ధలవబోతున్న అగ్ని పర్వతం లా సెగలు కక్కుతున్న భర్త రూపాన్ని ఇన్నేళ్ల కాపురంలో ఎప్పుడు చూసేరగదు. నోట్లో తడి ఆరి పోయింది వసంత కి. వాణి కనిపించక రెండో రోజు. మాధవరావు అతని స్నేహితుడు కలసి వూరంతా గాలించి వచ్చారు. తెలిసిన వాళ్ళకి ఫోన్లు, పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్, అన్ని ప్రయత్నాలు చేసాడు.

చుట్టు పక్కల అపార్ట్‌మెంట్‌లో గుసగుసలు మొదలయ్యాయి. "సవతి కూతురట". వాతలు పెడుతుందట, అలివేలు కళ్ళారా చూసింది అని "సాక్షాధారాలు." ఆవిడే తరిమే సుంటుంది, అని ఒకరు, ఎవరికైనా అమ్మేసిందేమో - ఇంకొకరు. పుట్టిండంటే పురుగు పట్టేసిందని కథలల్ల గల కళాకారిణిల స్టేట్మెంటులు.

బయటకు మొహం చూపట్లేదు వసంత. 'హంతకురాలన్న ముద్ర వేసేందుకైనా వెనకాడని వాళ్లకు అసలు అట్లకాడ వేడి కూడా చెయ్యలేదంటే నమ్ముతారా?' భర్త అయితే తన మొహం చూడడానికి కూడా ఇష్ట పడడం లేదు. అది మరీ శిక్షయి పోయి మనసుని కోత పెట్టేస్తోంది. తన కర్కశత్వం ఎంత హద్దు దాటి వుండక పోతే గోవు లాంటి భర్త పరశురాముడవుతాడు? తను చూపిన నరకం ఎంత భరించారని దైపోతే నోరు వాయి లేని పసి పిల్ల ఇల్లు దాటి పోతుంది.' నాకు సాటెవ్వరు అన్నట్లు తల ఎగరేస్తున్నట్టుండే వసంత భుజాలు కుచించుకుని వంగి పోతోంది.

తల్లి, తండ్రి వచ్చారు. "నువ్వు తెలివి గల దానివే అమ్మాయి, సవతి కూతుర్ని బాగా వదిలించుకున్నావ్." అన్నాడు తండ్రి వ్యగ్యంగా. చెర్నకోల చివరల చురుకు తగిలిన దానిలా తుళ్ళి పడిందీ వసంత. "మీరు కూడానా నాన్నా?" గధ్గద స్వరం తో అన్నది. "ఏ లోకంలో వుందో నీ చెల్లెలు నిన్ను క్షమించదే" అన్నది తల్లి ఏడుస్తూ. వులిక్కి పడింది వసంత. నిజంగానే కళ్లు మూస్తే కళ్యాణి కనిపిస్తోంది. "దాని తప్పేమున్నదని నా మీద పగని దాని మీద చూపించుకున్నావ్. నీకు మటుకు నా వుసురు తగలదూ? -" కోపంగా శపిస్తోంది.

భగవాన్ "పశ్చాత్తాపంతో చేతులు రెండు ముకుళించి నుదుటి కానించింది." లోకులు హంతకురాలంటున్నారు. శత్రువు ఎదురురొస్తే మొహం తిప్పు కున్నట్లు చాటవు తున్నాడు పెనిమిటి. చివరికి కన్నవాళ్ళు తోడబుట్టిన వాళ్ళు కూడా రాక్షసివంటున్నారే...

అంత చెడ్డదా తను? వాణి ఇక కనబడక పోతే? శవము అయి దొరికితే? ఈ మచ్చ శాశ్వతం గా తన నుదుట ముద్రయి పోదా?

వణికి పోతూ తల్లి ముందు సాగిలపడి పోయింది వసంత. "అమ్మా ఈ నేరం నెత్తిన మోస్తు జీవితాంతం ఆయన కళ్ళెదురుగా తిరగలేనమ్మా. నువ్వే ఏ విషమో నా గొంతులో పోసి ప్రాయశ్చి త్తం చెయ్యమ్మా" కట్టలు తెంచుకున్న దుఃఖవేశం తో బావురుమన్నది. ప్రక్షాళన మయిన కూతుర్ని తృప్తి గా చూసిందావిడ.

ఓ గంట తర్వాత తాతగారి వేలు పట్టుకుని ఇంట్లోకి వచ్చింది వాణి. ఆయన చెప్పిన కట్టు కథ ఇక్కడ అప్రస్తుతం.

* * * * * *

ఆ మర్నాడు నీలం రంగు డబ్బా తీసుకుని పెయింటర్ వచ్చాడు. మాధవరావు ఆతనిని గదిలో ఎక్కడ రంగు వేయాలో తీసుకువెళ్లి చూపిస్తున్నాడు.

"వద్దు" అంది వసంత. ప్రశ్నార్థకంగా చూశాడు మాధవరావు.

"నా బుద్ధి పక్కదారి పట్టినపుడు హెచ్చరిస్తు వుంటుందీ మరక. దానిక్కడే వుండనీయండి." అన్నది వసంత నిబ్బరంగా.

సమాప్తం.